31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శనివారం 27 జూన్ 2026 | పేజీలు : 8


# రోళ్లవాగు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.**

**-రోళ్లవాగును పరిశీలించిన సంక్షేమ శాఖ మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్**



**చురకలు విలేకరి, బీర్పూర్, జూన్ 26:** రోళ్లవాగు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలంలోని రోళ్ల వాగును సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రోళ్ల వాగు పరిసర ప్రాంతాలను సందర్శించిన మంత్రి, వాగు ప్రస్తుత పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో నీటి ప్రవాహం, వాగు సామర్థం, ప్రజలకు ఎదురయ్యే 2లో

# ప్రజా ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ

**-వైద్యానికి ప్రథమ ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం -ఏఎన్ఎం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం..**

**-రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**





**చురకలు విలేకరి, బీర్ పూర్, జూన్ 26:** ప్రజలు ఆశీర్వదించి ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో పేదలకు అందుబా టులో వైద్యాన్ని తీసుకురావడా నికి అనేక చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దా మోదర రాజనర్సింహ చోరవతో జగిత్యాల జిల్లాలో సర్కారు వైద్యాన్ని అన్ని వర్గాల ప్రజలకు అందించడానికి చర్యలు తీసు కుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందు లో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజ్ నిర్మాణంతో పాటు 450 పడకల ఆసుపత్రి నిర్మాణం చేస్తున్నామని మంత్రి తెలిపారు. జగిత్యాలలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తూ జగిత్యాల జిల్లా కేంద్రాన్ని మెడికల్ హబ్ గా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. బీర్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లతో పాటు సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు అడగకుండా నే ప్రమాద బీమా కల్పించిందని రాష్ట్రంలోని ఏఎన్ఎంలు ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మారు మూల మండలమైన బీర్ పూర్ అభివృద్ధికి తన వంతుగా సహా య సహకారాలు అందిస్తానని మంత్రి తెలిపారు అంతకు ముందు బీర్ పూర్ లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమా ర్ మాట్లాడుతూ మారుమూల మండలాల అభివృద్ధి కోరకు ప్రత్యేక నిధులు సాధించి మారుమూల మండలాల అభివృద్ధికి చర్య లు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రాన్ని వైద్య సేవలకు నిలయంగా మార్చడానిక - 2లో

# సమిష్టి కృషితోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యం

**జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 26 :** సమిష్టి కృషితోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో గురువారం యాంటీ డ్రగ్స్ 3కెరన్ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. ఎం. సంజయ్ కుమార్, జిల్లా అధికారులు, వైద్యులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివేకానంద స్టేడియం (ఓల్డ్ బస్ స్టాండ్) నుంచి ప్రారంభమైన 3కె రన్ను జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. టవర్ సర్కిల్, న్యూ బస్ స్టాండ్ మీదుగా ఐఎంఏ హాల్ వరకు కొనసాగిన ఈ రన్లో వందలాది మంది యువత ఉత్సాహంగా పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనపై తమ వంతు పాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తును కూడా దెబ్బతీసే అత్యంత ప్రమాదకరమైన వ్యసనమని అన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్కు దూరంగా ఉండి విద్య, క్రీడలు, ఉపాధి, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో డ్రగ్స్ విక్రయం, రవాణా, వినియోగంపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డా. ఎం. సంజయ్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు సమిష్టిగా పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని -2లో

**యువత, విద్యార్థులు**

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి




**ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



**చురకలు ప్రతినిధి,సిరిసిల్ల,జూన్ 26 :** డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ ఫోర్స్ ఆద్వర్యంలో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై జిల్లావ్యాప్తంగా వివిధ విద్యాలయాల్లో వారం రోజులుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా -2లో

## పాత్రికేయునికి మాతృవియోగం

**-పలువురి పరామర్శ**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూన్ 26 :** నమస్తే తెలంగాణ దినపత్రిక హుజురాబాద్ ఆర్ సి ఇన్చార్జిగా పనిచేస్తున్న గూడూరు కొండల్ రెడ్డి మాతృమూర్తి గూడూరు లక్ష్మి గురువారం సాయంత్రం మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు శుక్రవారం స్వగ్రామమైన ఇప్పల నర్సింగాపూర్ లో జరిగాయి. గ్రామస్తులు కుటుంబ సభ్యులు బంధువులు ఆమె అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. గూడూరు లక్ష్మి మృతికి సీనియర్ పాత్రికేయులు కోరెం సుధాకర్ రెడ్డి, సాక్షి వరంగల్ బ్యూరో గడ్డం రాజిరెడ్డి, తిరునగరి ఆంజనేయస్వామి, మామిడి రవీందర్, సర్పంచ్ కట్కూరి మల్లారెడ్డి, గడ్డం ధర్మారెడ్డి, అల్లి నరేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కాయిత రాములు, కామణి రవీందర్, మండల యాదగిరి, కూడికాల సురేష్ బాబు, పరంకుశం కిరణ్ కుమార్, హర్షవర్ధన్, మహేష్, పిల్లల సతీష్, పబ్బా తిరుపతి, మనీషా స్టూడియో ప్రసాద్, అలుమల్ల సాంబశివరెడ్డి, టేకుల సాగర్, రజనీకాంత్, దాము, స్వామి, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు టీవీ5 మక్సూద్, ఎన్టీవీ రాజు, టీవీ9 శ్రీధర్, తదితరులు సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

## సమిష్టి కృషితోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యం

**మొదటి పేజీ తరువాయి....** పేర్కొన్నారు. డ్రగ్స్ కు నో చెప్పుదాం – ఆరోగ్యవంత మైన, సురక్షితమైన సమాజాన్ని నిర్మిద్దాం అనే నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం 3కె రన్లో విజేతలుగా నిలిచిన యువతకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజా గౌడ్, మున్సిపల్ చైర్పర్సన్ సామిండ్ల వాణి శ్రీనివాస్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ఐఎంఏ జగిత్యాల అధ్యక్షులు డా. గుడూరి హేమంత్, కార్యదర్శి డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి డా. కోటగిరి సుధీర్ కుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు వరంగల్‌లో జాబ్ మేళా

### 5 వేల ఉద్యోగాల భర్తీకి అవకాశం

**వరంగల్,జూన్ 26(చురకలు):** నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 27న వరంగల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎనఎస్‌డీసీ) ఆధ్వర్యంలో 'వరంగల్ కౌశల్ మహోత్సవ' పేరుతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్‌లోని కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) కళాశాల ప్రాంగణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభం కానుందని, ప్రముఖ ప్రైవేట్ సంస్థలు పాల్గొని సుమారు 5 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు పొందాలని కోరారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఈ మేళా మంచి అవకాశంగా నిలవనుందని పేరొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం

### సర్ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలి

**వరంగల్,జూన్26(చురకలు):** ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం అని బిజెపి నేతలు అన్నారు. ఓటరు జాబితా సవరణ పక్రియ ప్రారంభం కాగా ఎన్యుమరేషన్ పంపిణీ పక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఎసఐఆర్ ద్వారా కచ్చితమైన సమాచారంతో కూడిన ఓటరు జాబితా తయారవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించేందుకు తమ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ఇప్పటికే పార్టీపరంగా బీఎలఏలను నియమించామని, వారు బూత్ స్థాయిలో ఓటర్లను కలుస్తున్నట్లు చెప్పారు. గ్రావిణ ప్రాంతంలో మ్యాపింగ్ దాదాపు పూర్తయ్యిందని, హనుమకొండ వంటి పట్టణాల్లో మ్యాపింగ్ కొంత కష్టతరంగా మారిందనే సమాచారం పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకున్నామన్నారు. కానీ, ఓటరు మ్యాపింగ్ చేసేందుకు ఎన్నికల కమిషన్, బీఎల్‌వోలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.

# యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**మొదటి పేజీ తరువాయి...** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ ఫోర్స్ ఆద్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుంచి పద్మనాయక కల్యాణ మండపం వరకు నిర్వహించారు. అనంతరం మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, నష్టాలపై స్కూల్ విద్యార్థులు, సిరిసిల్ల నర్సింగ్ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆలోచింపజేశాయి. డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. వివిధ స్టాళ్లను అతిథులు పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట సే నో టూ డ్రగ్స్.. సే ఎస్ టూ లైఫ్ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన చేశారని గుర్తు చేశారు ఇందులో భాగంగా డ్రగ్స్ ను నిర్మూలించేందుకు రాష్ట్రంలో ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసి విస్తృతంగా దాడులు చేస్తుందని తెలిపారు. యువత, విద్యార్థులకు డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. యువత సన్మార్గంలో వెళ్లేలా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాల బాట ను వీడండి.. మైదానం బాట పట్టండి అని సీఎం పిలుపు నిచ్చారని గుర్తు చేశారు. యువత సన్మార్గంలో నడవాలని పిలుపు నిచ్చారు. ఈగల్ ఫోర్స్ ఆద్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ పై దాడులు, డ్రగ్స్ కు వ్యతిరేకంగా ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. పోలీస్ శాఖ శాంతి భద్రతల తో పాటు పోలీసులు రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారని, హెల్మెట్ ధరించాలని కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని, సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక చర్యలు తీసుకుంటున్నారని అభినందించారు. యువత, విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించేలా ఒలింపిక్స్ లో పతకాలు సాధించేలా రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ యూనివర్సిటీ తీసుకువచ్చారని తెలిపారు. అలాగే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సీఎం కప్ పేరిట జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆధ్వర్యంలో వివిధ ఆటల పోటీలు నిర్వహించి నైపుణ్యం ఉన్న క్రీడాకారులు వెలుగులోకి వచ్చేలా కృషి చేశారని అభినందించారు. యువత, విద్యార్థులు ఏదో ఒక హాబీ తో ఉండాలని సూచించారు.

డ్రగ్స్ రహిత జిల్లా కోసం కార్యాచరణ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు తమకు నచ్చిన అంశాల్లో రాణించాలని పేర్కొన్నారు అందరికీ శారీరక, మానసిక ఆరోగ్యం చాలా అవసరమని వివరించారు. దేశంలో యువత ఎక్కువగా ఉన్నారని తెలిపారు. వారు అందరూ దేశ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని పిలుపు నిచ్చారు. డ్రగ్స్ కు బానిస కావద్దని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు ఖాళీగా ఉండవద్దని, తమకు నచ్చిన అంశాల్లో సమయం కేటాయించాలని సూచించారు. విద్యార్థులు చదువులో.. యువత తాము ఎంచుకున్న రంగం లేదా ఉద్యోగంలో ఉండాలని సూచించారు. ఎవరైనా మానసికంగా ఇబ్బంది పడితే సైకాలజిస్ట్ ను సంప్రదించాలని తెలిపారు. డ్రగ్స్ కు బానిస అయిన వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం కు తరలించాలని సూచించారు. డ్రగ్స్ వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నట్లు దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులు యువత తమ అనుకున్న లక్ష్యాలు సాధించాలని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలోని అన్ని విద్యాలయాలు, అన్ని గ్రామాలు మున్సిపాలిటీలు డ్రగ్స్ రహితం కావాలని పేర్కొన్నారు. ఆ దిశగా పక్కా కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈగల్ ఫోర్స్ టోల్ ఫ్రీ నంబర్ 1908, కంట్రోల్ రూం నంబర్ 8712671111, 112 నంబర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, ఎస్ బీ డీఎస్ పీ వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ మహేష్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

# రోళ్లవాగు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**మొదటి పేజీ తరువాయి...** సమస్యలపై సమగ్రంగా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వాగు అభివృద్ధికి అవసర మైన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోళ్ల వాగు గట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వర్షాల సమయంలో వరద నీరు గ్రామాల్లోకి ప్రవేశించకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా వాగులో ఉన్న మట్టి, = చెత్త, పొదలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ రోళ్ల వాగు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినా వెంటనే స్పందించేలా కార్యాచరణ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రజల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ

**మొదటి పేజీ తరువాయి....** చేస్తున్న కృషికి మంత్రి అడ్లూరి తో పాటు ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారం లభిస్తుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఉదయం 9 గంటల నుండి సా యంత్రం నాలుగు గంటల వరకు వైద్య సేవలు అందిస్తామని రానున్న రోజుల్లో 24 గంటల పాటు వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వివరించారు. జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఏడాదిలోని బీర్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు పూర్తి చేశామని అన్నారు. పూర్తిస్థాయిలో వైద్య సేవలను బీర్పూర్ లో అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హరీష్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శారద, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోతో తక్కువ వర్షపాతం

**న్యూఢిల్లీ,జూన్26(చురకలు):** ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు. అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది.

# లలితామాత ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు

**-అమ్మ వారికి ముడుపు సమర్పణ**





**జగిత్యాల ప్రతినిధి, జూన్ 26 :** జగిత్యాల రూరల్ మండలం పొలాసలో కొలువై ఉన్న 108 శ్రీచక్ర లలితమాత ఆలయంలో ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య ఆధ్వర్యంలో శుక్రవారం సందర్భంగా శ్రీ చక్రాలకు సుహాసినిలు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.లలితా సహస్ర నామ పారాయణం గావించిన అనంతరం అన్నదానం చేశారు. జగిత్యాల పట్టణ చింతకుంటలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో జ్యేష్ట మాసం,శుక్రవారం ద్వాదశి పర్వదినం పురస్కరించుకొని,మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేసారు.పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు.కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం,అమ్మ వారి ప్రసాదం తాంబూలం ఆలయ పూజారి ఆశీర్వచనములతో బహుకరించారు.అమ్మ వారికి ముడుపులు కట్టారు.ఈ కార్యక్రమములో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వద్దగట్ల రాజన్న,వర్కింగ్ ప్రెసిడెంట్ వొద్దాల శ్రీనివాస్,ఊటూరి కళ్యాణి, పొంపట్టి సులోచన, గంగాధర్, వనజ, రాజేందర్ రావు, శేఖర్, మహేందర్, సత్తయ్య,భారతాల రాజాసాగర్, మహిళా సభ్యులు వొద్దాల లత, భారతాల గీత,వనజ,గంగమ్మ అర్చకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారులపైకి బండ రాళ్లు...!

**-దారులను దున్నేస్తున్నా పట్టించుకోని ఆర్అండ్ బీ, పోలీసు, రెవెన్యూ అధికారులు**

**- పొంచి ఉన్న ప్రమాదాలు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూన్ (26) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు తమ పంట పొలాలు, తోట భూములను సన్నద్ధం చేసుకుంటూ అడ్డుగా ఉన్న పెద్దపెద్ద బండ రాళ్లను రహదారులపైకి నెట్టేశారు. దీంతో రహదారుల వెంట రోడ్డు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలకేంద్రం నుండి మెట్ పల్లి,ములారాంపూర్ – గోదూర్,వర్షకొండ – గోదూర్ ప్రధాన రహదారులున్నాయి. ప్రధాన మార్గాలు కావడంతో వాహనాల రద్దీ ఎక్కు వగానే ఉంటుంది. ఆర్టీసీ బస్సులతోపాటు వంద లాది ప్రైవేటు వాహనాలు ప్రతిరోజు ఈ రహదారు లపై రాకపోకలను సాగిస్తున్నాయి. ప్రతీ మార్గంలో డబుల్ రోడ్డున్నా. ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఇటీవల కొందరు రైతులు ఆర్అండ్బి స్థలాలను యథేచ్ఛగా కబ్జా చేస్తూ తమ పంట పొలాల్లోని బండ రాళ్లను రహదారి పైకి నెట్టేయడం తో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డబుల్ రోడ్డు ఉందని వాహన చోదకులు వేగంగా వస్తూ బండ రాళ్లను గుర్తించే



లోపే ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో ప్రయాణం చేసేందుకు జంకుతున్నారు. పలు ప్రధాన రహదారులకానుకొని ఉన్న పంట పొలాలకు చెందిన రైతులు తమ పొలాలతోపాటు రహదారులను సైతం యథే చ్ఛగా దున్నేస్తున్నారు. రహదారులపై ఎదురెదురు గా భారీ వాహనాలు వచ్చినప్పుడు రోడ్డు పక్కకు దిగేందుకు కూడా మార్గం లేని దుస్థితి నెలకొంది. ఈ రహదారి వెంటే సంబంధిత అధికారులు, పోలీస్, రెవెన్యూ అధికారులు వెళ్తున్నా పట్టించుకోకోక పోవడం దారుణమని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# కారుణ్య నియామక ఉద్యోగులకు కౌన్సిలింగ్




**చురకలు విలేకరి, జగిత్యాల, జూన్ 26:** కన్న తల్లిదండ్రులను పోషిస్తామని అఫిడవిట్ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ సర్వీసులోనే ఉంటూ మరణించిన తండ్రి/తల్లి, మరియు అనారోగ్యం తో మెడికల్ ఇన్ వాలిడేషన్ పొందిన ఉద్యోగుల స్థానంలో ఉద్యోగాలు పొంది ఆ తల్లి దండ్రులను నిరాదరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కొడుకులకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు కౌన్సిలింగ్ చేయడంతో వారు తమ తల్లి దండ్రుల ను పోషిస్తు,బాగోగులు చూసుకుంటామని సమ్మతించి ఒప్పంద పత్రాలు సమర్పించి వెంట తీసుకెళ్లారు. జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయ కౌన్సిలింగ్ కేంద్రానికి శుక్రవారం జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి, డివిజన్ మండలాలకు చెందిన వివిధ జిల్లాల్లో ఉద్యోగాలు చేస్తున్న కొడుకు లను వారి తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు హరి అశోక్ కుమార్ పిలిపించి తల్లి దండ్రులను పోషించక పోతే సంబందించిన ఉద్యోగ నియామక అధికారులయిన జిల్లాల కలెక్టర్లకు ఫిర్యాదు చేస్తే సస్పెండ్ తో పాటు ఉద్యోగాల నుంచి డిస్మిస్ అవుతారని హెచ్చరించారు. ఉద్యోగుల తల్లి దండ్రుల పోషణ చట్టం -2026 ను వివరిస్తూ హరి అశోక్ కుమార్ కౌన్సిలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ జిల్లా ప్రతి నిధులు గౌరిశెట్టి విశ్వనాథము,పి. సి హన్మంత రెడ్డి, వి.ప్రకాష్ రావు,ఎం. డి. యాకూబ్,రాధ, కరుణ తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లిలో నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం






**చురకలు ప్రతినిధి కోరుట్ల జూన్ 26 :** కోరుట్ల నియోజకవర్గం మెట్‌పల్లి పట్టణంలోని 6వ వార్డులో షేక్ మొహరా బేగం సదుల్లా నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఇంతవరకు ఏ ప్రభుత్వం కూడా ఈ స్థాయిలో పేదల గృహ నిర్మాణానికి సహాయం చేయలేదని పేర్కొన్నారు.సొంత స్థలం ఉండి ఇల్లు లేని పేదలు ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా లబ్ధి పొందాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ పేదలకు సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కౌన్సిలర్ బత్తుల నరేష్, గుడికందుల అజయ్, మారుల ప్రవీణ్, మైలారం రాము, కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జి జాకీర్, షకీల్, మహేందర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్‌నగర్,ఇస్లాంపూర్‌లో డ్రైనేజీ,సీసీ రోడ్లు నిర్మించాలని వినతి



**చురకలు ప్రతినిధి,కోరుట్ల,జూన్ 26 :** మెట్‌పల్లి పట్టణంలోని 7వ వార్డులోని హనుమాన్‌నగర్, ఇస్లాంపూర్ ప్రాంతాల్లో డ్రైనేజీ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అబ్దుల్ జాకీర్ శుక్రవారం తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారిందని, దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అలాగే హనుమాన్‌నగర్, ఇస్లాంపూర్ ప్రాంతాల్లో సీసీ రోడ్లు దెబ్బతినడంతో వాహనదారులు, మహిళలు, చిన్నారులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కావున మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి 7వ వార్డులోని హనుమాన్‌నగర్, ఇస్లాంపూర్ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తరపున ఈ వినతిని చేస్తున్నట్లు అబ్దుల్ జాకీర్ తెలిపారు.




# ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది గత ప్రభుత్వమే

**- జువ్వాడి కృష్ణారావు**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూన్ 26 :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను భారీ అప్పుల ఊబిలోకి నెట్టింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు విమర్శించారు. శుక్రవారం కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్ర అప్పులు సుమారు రూ.69 వేల కోట్ల మేర మాత్రమే ఉండగా, బీఆర్ఎస్ పాలన ముగిసే నాటికి రాష్ట్రాన్ని భారీఅప్పుల భారం లోకి నెట్టారని ఆరోపించారు. రాష్ట్ర సంపదను ప్రజల అభివృద్ధికి విని యోగించకుండా కల్వకుంట్ల కుటుంబ ప్రయోజనాలకే ఉపయోగించారని విమర్శించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు అభివృద్ధిపై అవగాహన లేదని, రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయాలనే ఉద్దేశంతో అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే విద్యుత్,సాగునీరు, తాగునీరు,గురుకులాలు, మెడికల్ కళాశాలలు,విద్యా-వైద్య రంగాల్లో కీలక అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాని దేనని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తొలి సంతకం ఉచిత విద్యుత్ ఫైల్‌పైనే చేశారని గుర్తుచేశారు. అలాగే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కాకతీయ కాలువల ద్వారా కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వాల పాత్ర కీలకమని తెలిపారు. ప్రతి గ్రామానికి రక్షిత మంచినీటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయగా, బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో పాత వ్యవస్థలకు రంగులు వేసి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో గురుకులాలు, నవోదయ విద్యాలయాలు, మెడికల్ కళాశాలలు ఏర్పాటయ్యాయని, వాటి ద్వారానే నేటి నాయకులు కూడా చదువుకున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించక పోవడంతో ప్రభుత్వ పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని అన్నారు. కాంగ్రెస్ హయాంలో కోరుట్ల పట్టణంలో ఫిల్టర్ బెడ్ నిర్మించి మంచి నీటి సరఫరా చేపట్టగా, అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం దానిని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవు తుందని, ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు ప్రజలు తగిన సమా ధానం చెబుతారని జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, ఎం.ఏ. నయీమ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామ దేవతలకు మొక్కులు



**-మహాలక్ష్మి,తాతమ్మ, గంగమ్మ దేవతలకు మొక్కులుచెల్లించిన అభివృద్ధి కమిటీ**

**- గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గోల్లెంతో ఊరేగింపు**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జున్ (26) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామం లో గ్రామ అభివృద్ధి కమిటీ 16 కుల సంఘాల అధ్వర్యం లో శుక్రవారం మహలక్షి, గంగమ్మ,తాతమ్మ గ్రామదేవతలకు మెక్కులను చెల్లించుకున్నారు. గ్రామం లోని ప్రధాన రహదారులలో గంగపుత్ర సంఘం గోల్లెం వేయగా దప్పు చప్పుల్ల మధ్య అమ్మవారి, గంగమ్మ, తతమ్మ ల చిర సార తదితర వస్త్రాలు,పుజసామగ్రి ని ఎదుర్కొంటు వెళ్ళారు. పలు చోట్ల పోతరాజు ల విన్యాసాలు అబురపరిచాయి. వర్షాలు సంవృద్ధిగ కురిసి పాడి పంటలు సంవృద్ధిగ రావలని,గ్రామనికి ఎలాంటి కిడు సోకకుండా చుడలని. అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు ప్రత్యేక పుజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఈకార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎడిపెల్లి మురళి, సర్పంచ్ తరి రామనుజం, ఉపసర్పంచ్ బర్మ మల్లయ్య, అభివృద్ధి కమిటీ ఉపధ్యక్షుడు మెగిలి దేవదాస్, కోశాధికారి అన్నరపు రాజరెడ్డి, రైటర్ పెంట మహేష్ అభివృద్ధి కమిటీ సభ్యులు అంకతి రాజలింగం, కుమ్మరిపెల్లి మల్లేశం, పల్లి పెద్దులు,జిల్లా అనందం,అల్లెపు మహేష్, మాలేపు లక్ష్మణ్, సిలివేరి మహేష్, అక్కపెల్లి గంగాధర్,కనపర్తి నరేష్, పట్నం నర్సయ్య, గుడ్ల శ్రావణ్, మగ్గిడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.







## మోహన్‌రావుపేట శివారులో రోడ్డు ప్రమాదం

**-వ్యక్తి మృతి, భార్యకు గాయాలు**

**చురకలు ప్రతినిధి కోరుట్ల,జూన్,26 :** జగిత్యాల మండలం రఘురాముల కోట (హెచ్/ఓ తిమ్మాపూర్) గ్రామానికి చెందిన కట్లకుంట భూమారెడ్డి (భార్య లక్ష్మితో కలిసి) శుక్రవారం సాయంత్రం సుమారు 4:40 గంటలకు తమ మోటార్‌సైకిల్‌పై కుమార్తె గ్రామమైన వల్లంపల్లికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉన్నారు. మోహన్‌రావుపేట గ్రామ శివారులోని మూలమలకల వద్దకు చేరుకోగానే కరీంనగర్--డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు (నంబర్: TS02T1770) ఎదురుగా వచ్చి మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కట్లకుంట భూమారెడ్డికి తలకు, కుడికాలుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య కట్లకుంట లక్ష్మికి తల,కాళ్లు, భుజాలకు గాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమార్తె కొప్పెల అనిత ఫిర్యాదు మేరకు కోరుట్ల ఎస్సై ఎం. చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



**చురకలు విలేకరి, మల్యాల, జూన్ 26 :** మల్యాల మండలంలోని నూకపల్లి గ్రామాన్ని సోలార్ పవర్ పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం గ్రామ సర్పంచ్ మిలిటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి గ్రామస్తులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు వెల్మ లక్ష్మా రెడ్డి, మ్యాక లక్ష్మణ్, దొంగ ఆనందరెడ్డి, సర్పంచులు దారం ఆదిరెడ్డి, జంగిల్ అనుమంతు, ఇట్టిరెడ్డి శ్వేతాఅంజిరెడ్డి, మరాటి సత్తయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తాటిచెట్టుపై నుండి పడిన వ్యక్తికి తీవ్ర గాయాలు



**చురకలు విలేకరి, మల్యాల, జూన్ 26 :** మల్యాల మండలంలోని రామన్న పేట గ్రామానికి చెందిన కొత్తకొండ శ్రీనివాస్ అనే వ్యక్తి రోజువారి పనిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో నూకపల్లి మండువాలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో శ్రీనివాస్ ను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

## మంత్రి అడ్లూరిని కలిసిన ఉపసర్పంచులు



**చురకలు విలేకరి, బీర్పూర్, జూన్ 26 :** బీర్ పూర్ మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దగ్గుల వీరేశం ఆధ్వర్యంలో మండల ఉపసర్పంచులు శుక్రవారం మంత్రి అడ్లూరి లక్ష్మణకుమార్ను మర్యాదపూర్వకంగా కలివారు. ఈ సందర్భంగా ఉప సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని, పలు డిమాండ్ల కూడిన వినతిపత్రాన్ని మంత్రి అడ్లూరికి అందించారు. అనంతరం వారు మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ఉపసర్పంచులకు చెక్పవర్ రద్దు చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# కాట్రపల్లిలో చురుగ్గా రహదారి విస్తరణ పనులు

**చురకలు ప్రతినిధి,హుజురాబాద్ జూన్ 26 :** హుజురాబాద్ మండల పరిధిలోని కాట్రపల్లిలో సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు విస్తరణ ఎట్టకేలకు తెరపడుతోంది. హుజురాబాద్ నుండి భీమదేవరపల్లి వెళ్లే మార్గంలో కాట్రపల్లి ఉంటుంది. మండలంలో ఇదే చివరి గ్రామం. కాట్రపల్లి తర్వాత మాణిక్యపూర్ భీమదేవరపల్లి మండలంలోకి వస్తుంది. భీమదేవరపల్లి హనుమకొండ జిల్లాలో ఉంది.అయితే ఇరుకైన రోడ్డు కారణంగా చాలా కాలంగా ప్రయాణికులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ పాలకవర్గం కఠిన నిర్ణయం తీసుకుంది. గ్రామ ప్రధాన రహదారిలో రెండు వాహనాలు ఎదురుపడితే వెళ్లలేని పరిస్థితి ఉండేది. ప్రతిరోజూ వాహనదారులు,పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడటం



నిత్యకృత్యంగా మారింది. ఈ సమస్యపై స్పందించిన స్థానిక గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రత్యేకంగా సమావేశమై, రోడ్డు విస్తరణ చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. పాలకవర్గం తీర్మానం మేరకు గ్రామంలో రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించారు. ఆక్రమణలను తొలగించడంతోపాటు 40 అడుగుల వెడల్పుతో సువిశాలమైన రహదారిని సిద్ధం చేస్తున్నారు. రహదారి విస్తరణకు నడుం బిగించిన పాలక వర్గానికి,పంచాయతీ సిబ్బందికి గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు.

**ప్రజల సహకారంతోనే విస్తరణ**

కాట్రపల్లిలో ప్రధాన రహదారి విస్తరణలో గ్రామస్తుల ప్రోత్సాహం, చొరవ ప్రశంసనీయమని సర్పంచ్ పెరుమాండ్ల హైమా - బిక్షపతి, ఉపసర్పంచ్ గంగధరి బిక్షపతి అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ..రోడ్డు విస్తరణలో కొంతమంది ఇబ్బంది పడిన మాట గ్రామాభివృద్ధి దృశ్య అమలు చేయక తప్పడం లేదని అన్నారు.గ్రామస్తులు పెద్ద మనసుతో విస్తరణకు సహకరించారని తెలిపారు. కాట్రపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎందుకు ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో వార్డు సభ్యులు కోమటి శ్రీనివాస్, బాలగోని అరుంధతి కృష్ణంరాజు, తాళ్లపెల్లి అనూష అనిల్, తాడూరి ప్రమోద్ గౌడ్, మిడివెల్లి నాగరాజు, నిమ్మల నరేష్, ముప్పు లావణ్య సహదేవ్, మాడుగుల విజయలక్ష్మి వెంకటస్వామి, మైసా అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు

**-ఎస్సై కొట్టే ప్రసాద్**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 26 :** యువత విద్యార్థులు మత్తు బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దు అని కమాన్పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ అన్నారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కమాన్ పూర్ ఎస్ఐ కొట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కమాన్ పూర్ బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం ప్రాంతం లో గంజాయి,ఇతర మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన ఎస్సై కల్పించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహం వద్ద యువకులచే మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కొట్టే ప్రసాద్ మాట్లాడుతూ, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు బానిసలైన వారిని నేరస్తులుగా కాకుండా బాధితులుగా చూడాలని అన్నారు.




మత్తువ్యసనానికి గురైన వారిలో ఆరోగ్య పరిస్థితి,మానసిక స్థితి,ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా డీ-అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు వ్యసనానికి గురైన వారిని గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే,వారిని సంబంధిత ఆసుపత్రులు , డీ-అడిక్షన్ సెంటర్లకు తరలించి వైద్య చికిత్స,కౌన్సెలింగ్, పునరావాసం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యసనాన్ని శిక్షల ద్వారా కాకుండా చికిత్స ద్వారా నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు. గంజాయి,మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల సహ కారం అత్యంత కీలకమని పేర్కొంటూ, డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువత,ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం నిర్వహణ సందర్భంగా కొంతమంది వాహనదారులకు స్వల్ప అసౌకర్యం కలిగినప్పటికీ సహకరించి నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గంజాయి నియంత్రణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ,సమాజ భద్రత కోసం ప్రజలు పోలీసులకు సహకరించి, సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతా ల్లోని యువత గంజాయి కి అలవాటు పడుతున్నారని వారిని వారించే బాధ్యత ప్రతి తల్లిదండ్రుల మీద ఉందని ఎస్సై పేరు కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, నాగారం ఉపసర్పంచ్, ఉడ్నాల శ్రీనివాస్, ఇరుగు రాళ్ల రాజు, తెలుగు రాళ్ల కుమార్, దాసరి రామస్వామి, అనవేన కొండయ్య, కోలేటి రమేష్, సిబ్బంది బాపన్న, దాసి సతీష్, అశోక్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పోశమ్మ ఉత్సవాలకు గ్రామ సర్పంచ్ లక్ష విరాళం

**-గ్రామ సర్పంచ్ బాలరాజు నర్సాగౌడ్ లక్ష విరాళం**

**-కృతజ్ఞతలు తెలిపిన బండ లింగంపల్లి మాదిగ సంక్షేమ సంఘం**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూన్ 26 :** ఎల్లారెడ్డిపేట మండలం బండ లింగంపల్లి గ్రామంలోని శ్రీ పోశమ్మ మహామాత మహోత్సవాలకు గ్రామ సర్పంచ్ బాలరాజు నర్సాగౌడ్



లక్ష రూపాయల విరాళం మాదిగ సంక్షేమ సంఘానికి అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బాలరాజు నరసాగౌడ్ కు మాదిగ సంక్షేమ సంఘం కృతజ్ఞతలు తెలిపారు. బండలింగంపల్లి గ్రామంలో నిర్వహించ నున్న పోశమ్మ మహామాత మహోత్సవా లకు సర్పంచ్ బాలరాజు నర్సాగౌడ్‌కు మాదిగ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. గ్రామ సర్పంచ్ బాలరాజు నరసాగౌడ్ మాట్లాడుతూ ఆహ్వానాన్ని స్వీకరించి, మహోత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, గ్రామ ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## మొహరం సందర్భంగా షర్బత్ పంపిణీ



**చురకలు ప్రతినిధి, కమాన్‌పూర్ జూన్ 26 :** మొహరం పండుగ సందర్భంగా షర్బత్ (తీపి పానకం) శుక్రవారం పంపిణీ చేశారు. కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామంలో గల మహమ్మదీయ మస్జిద్లో మోబిన్ మరియు కలీం ఆధ్వర్యంలో షర్బత్ను పంపిణీ చేశారు. శుక్రవారం నమాజ్ చేసిన అనంతరం ఫాతిహా ఇచ్చి ఆయా షర్బతును మస్జిద్‌లోని నమాజ్‌కు వచ్చిన యువకులకు గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొహరం నెల విశిష్టత గురించి మత గురువు మోబిన్ వివరించారు. ఈనెల హసేన్ హుస్సేన్ వార్ల జ్ఞాపకార్థం సంతాపదినాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇజాజ్ ఖా న్ సయ్యద్ ఇమామ్, హఫీజ్, అక్తర్,అజ్జు, షేక్ అలీ,బషీర్, తపస్సు నమాజ్, జబ్బార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి,డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీసుల 2కేరన్



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, జూన్ 26 :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో శుక్రవారం బెల్లంపల్లి వన్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్ కు వ్యతిరేకంగా 2 కే రన్ నిర్వహించారు. బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ 2కె రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల యువత జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు శాఖ కృషి చేస్తుందని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ కు సంబంధించిన వివరాలు తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ఆయన సూచించారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు తో పాటు పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని ప్రారంభించిన బెల్లంపల్లి మున్సిపల్ అధ్యక్షురాలు



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, జూన్ 26 :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని సుభాష్ నగర్ బస్తీలో శుక్రవారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) సర్వేను బెల్లంపల్లి మున్సిపల్ అధ్యక్షురాలు దావస్వాతి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్ సర్వేను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. బి ఎల్ వో లు ఇంటింటికి వెళ్లి సంబంధిత ఫారాలను పంపిణీ చేస్తారని, ఓటర్లు వాటిని పూర్తిగా నింపి సంబంధిత బి ఎల్ ఓ లకు తిరిగి అందజేయాలని కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి సర్వేను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఎక్కడ పొరపాట్లు జరగకుండా కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఓ లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు.

# ఉద్యమకారులకు పెన్షన్, ఇంటి స్థలాలు ఇవ్వాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 26 :** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారునికి పెన్షన్ తో పాటు ఇంటి స్థలాలు ఇవ్వాలి అని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉద్యమకారుల ఇన్చార్జి కావేటి సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు కమాన్ పూర్ క్రాస్‌రోడ్ వద్ద విలేఖల సమావేశంలో మాట్లాడారు.ఈనెల 28న హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనశీ విజయవంతం చేయండి అని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంఛార్జి కావటి సతీష్ యాదవ్ పిలుపునిచ్చారు.తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో జూన్ 28న హైదరాబాద్‌లో నిర్వహించ నున్న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంను విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్.కావటి సతీష్ యాదవ్ పిలుపునిచ్చారు.శుక్రవారంకమాన్ పూర్ ఎక్స్‌రోడ్ వద్ద ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నియమించిన కేకే కమిటీ నివేదికపై తక్షణమే స్పందించి, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ మరియు గుర్తింపు, గౌరవం సరైన భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యలపై సాను కూలంగా స్పందించి, వారి సంక్షేమం కోసం కే కే కమిటీని నియమించి నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి శ్రీధర్ బాబు కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. ఉద్యమకారులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని ఆయన కోరారు.ఈ ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నట్లు, ఉద్యమకారు లందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలువురు ఉద్యమ నాయకులు, ప్రతినిధులు పాల్గొని ఉద్యమకారుల సమస్యల పరిష్కారంపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.

# ఎల్లారెడ్డిపేటలో న్యూమరేషన్ ఫారాల పంపిణీ

**-ఓటర్ జాబితాలో ఉన్న వారందరూ ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా నింపాలి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 26 :** ఎల్లారెడ్డిపేట మండలంలో న్యూమరేషన్ ఫారాలను బిఎల్ఓలు శుక్రవారం ఓటర్లకు పంపిణీ చేశారని తహసిల్దార్ సుజాత ఎంపీడీవో సత్తయ్యలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ జాబితాలో ఉన్న వారందరూ న్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా నింపాలని ఫారం ప్రస్తుత పాస్పోర్ట్ సైజ్ ఫోటోలను బిఎల్ఓలకు ఓటర్లు తప్పకుండా అందించాలన్నారు. అలాగే బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటు లో ఉండాలని ఎస్ఐ ఆర్ పై ఈ ఆర్ వో లు బూతులు అధికారులతో ప్రత్యేక హోదా సమగ్ర సవరణ అనేది చాలా ప్రత్యేకం అని బూతులు అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటు లో ఉండాలన్నారు. బిఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ జాబితాలో ఉన్న వారందరికీ న్యూమరేషన్ ఫారం అందించాలని సూచించారు ఫారాలు నింపడంతో సహాయం చేయాలన్నా ప్రతి ఓటర్ తమ పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు సిద్ధంగా పెట్టుకోవాలని సూచించారు బిఎల్ఓ లకు ఫారాలు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు వచ్చేనెల 24వ తేదీలోగా ఇవ్వాలన్నారు వీఆర్వోలు ఏఈవోలు బిఎల్వోలు సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాలన్నారు బి ఎల్ వోలు తమకు అందించిన సామాగ్రి ఐడి కార్డులతో తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి బిఎల్వోలతో కలిసి వెళ్లాలని ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పదవ వార్డులో బి ఎల్ ఓ సుంకరి బాల నరసవ్వ సీనియర్ జర్నలిస్ట్ బండారి బాల్రెడ్డి ఇంటికి వెళ్లి శుక్రవారం ఫారాలు అందజేశారు. అక్కడ బూత్ లెవెల్ ఏజెంటు ఇలియాస్ బాబా తదితరులు ఉన్నారు.

# కాగితాలకే పరిమితమైన మాలలకు 5% రిజర్వేషన్లు

**-మాల యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోతుంది**

**-రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 26 :** గంభీరావుపేట మండల కేంద్రంలో జాతీయ మాలల ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాలలకు 5% రిజర్వేషన్ కాగితాలకే పరిమితం:రోస్టర్ విధానంలో దగా ఎస్సీ వర్గీకరణ అనంతరం గ్రూప్-3 కింద మాల,మాల ఉపకులాల కు 5శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఉద్యోగ నియామకాలలో ఆ రిజర్వేషన్ అమలు కావడంలేదని దోసల చంద్రం ఆరోపించారు.ఇటీవల విడుదలైన ముద్రా పరీక్షల ప్రయోగశాల, టీఎస్ఆర్టీసీ ఉద్యోగ నోటిఫికేషన్లలో మాలలకు ఒక్క పోస్టు కూడా కేటాయించలేదని ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం రిజర్వేషన్ కేవలం కాగితాలకే పరిమితమైందని విమర్శించారు. నోటిఫికేషన్లలో రిజర్వేషన్ అమలు కాకపోవడంతో మాల యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని దోసల చంద్రం అన్నారు.జిల్లాల వారీగా నియామకాలు చేపడుతున్నప్పటికీ మాలలకు కనీస స్థాయిలో కూడా ప్రాతినిధ్యం లభించడంలేదని పేర్కొన్నారు.రోస్టర్ విధానంలో మాలల ను చివరి పాయింట్లలో ఉంచడం వల్ల వందల సంఖ్యలో పోస్టులు వచ్చినప్పుడే అవకాశం లభించే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఈ విధానాన్ని వెంటనే సవరించి మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జాతీయ మాలల ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం హెచ్చరించారు.

# వైభవంగా శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం



**చురకలు విలేఖరి వీణవంక జూన్ 26 :** వీణవంక మండల పరిధిలోని ఘన్ముక్ల గ్రామంలో శుక్రవారం స్థానిక శివాలయంలో శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా వేదమంత్రోత్సవాల నడుమ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ శివ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శివపార్వతుల కళ్యాణాన్ని కనులారా తిలకించారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. సాయంత్రం దేవతామూర్తులను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 26 :** కమాన్ పూర్ మాజీ ఎంపీపీ పోలేటి మారుతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కమాన్ పూర్ లో ఘనంగా సన్మానించారు.అమెరికా పర్యటన ముగించుకుని స్వగ్రామమైన “కమాన్ పూర్” మండల కేంద్రంలోని స్వగృహనికి చేరుకున్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు, కమాన్ పూర్ ఉమ్మడి మండల మాజీ ఎంపీపి “కోలేటి మారుతి” కి కమాన్ పూర్ మండల వైశ్య సంఘం ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా ఆత్మీయ సత్కారం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో.. వైశ్య సంఘం మండల అధ్యక్షుడు తాటిపల్లి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ గుండా శ్రీనివాస్, క్యాషియర్ మరాల రాజన్న,గుండా ప్రేమ్ కుమార్,మాజీ అధ్యక్షుడు కోలేటి బాపన్న,మాడూరి చంద్రశేఖర్,తాటిపల్లి సురేష్,కొల్లూరు శ్రీనివాస్,మాడూరి పూర్ణచందర్, గుండా నాగయ్యలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# భూ పోరాటానికి సిద్ధం కండి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 26 :** ఉద్యమకారులు భూ పోరాటానికి సిద్ధం కావాలి అని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అన్నారు. కమాన్పూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మట్టరాజ్య ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమంలో ఎందరో ప్రాణ త్యాగాలు చేశారని జైలు జీవితం గడిపారని అమరవీరులయ్యారని పేర్కొన్నారు. ఉద్యమం చేసి సాధించుకున్న తెలంగాణను గత పది సంవత్సరాలుగా కేసీఆర్ పట్టించు కోలేదని ఉద్యమకారులను ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు.వెంటనే తెలంగాణ ప్రభుత్వం 250 గజాల భూమి 25వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూలై రెండవ వారంలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఉప్పల్లో జరగబోవు పోరాటానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కోర్టు కనకయ్య ఆవిదుర్తి కళావతి మట్ట రాధా ఆవిదుర్తి శ్రావణ్ దూసరవీందర్ భోగి రాజేశ్వరి దేవ అనసూర్య సయ్యద్ రజాక్ అంతగిరి సంపత్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసాకు దరఖాస్తులు సమర్పించాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 26 :** పాలకుర్తి మండలంలో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన అర్హులైన రైతుల నుంచి రైతు భరోసా పథకం కింద దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈనెల 15 నాటికి భూ భారతి/ధరణి ఆధారంగా కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు మాత్రమే దరఖాస్తుకు అవకాశం ఉంది అని తెలిపారు.దరఖాస్తు తో పాటు ఈ పత్రాలను సమర్పించాలి.రైతు భరోసా పథకానికి రైతులు దరఖాస్తు ఫారం తో పాటు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీలతో ఈ నెల 5 వరకు ఏఈఓ ల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఇప్పటికే రైతు భరోసా పథకంలో నమోదైన రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు అని ఆయన స్పష్టం చేశారు.అర్హులైన రైతులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని పాలకుర్తి వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు.

# యువత భవిష్యత్తును చిదిమేస్తున్న గంజాయి, డ్రగ్స్

**-పిల్లల రక్షణలో ప్రతి ఒక్క తల్లిదండ్రుల పాత్ర కీలకం**
**-మెట్ పల్లి సీఐ సురేష్ బాబు**




**చురకలు విలేకరి,మెట్‌పల్లి, జూన్ 26 :** సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి మహమ్మారిని నిర్మూలించడం లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మెట్‌పల్లి సీఐ సురేష్ బాబు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వల్ల యువత తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి రహిత సమాజ స్థాపనకు పోలీసులు తీసుకుంటున్న చర్యలతో పాటు, తల్లిదండ్రులు, ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు.

**తల్లిదండ్రుల పర్యవేక్షణే పిల్లలకు మొదటి రక్షణ కవచం..**

పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కేవలం చదువు, తిండికే పరిమితం కాకూడదని సీఐ సురేష్ బాబు సూచించారు.

**పిల్లల ప్రవర్తనను గమనించండి..**

మీ పిల్లల ప్రవర్తనలో అకస్మాత్తుగా వచ్చే మార్పులను నిశితంగా గమనించాలి.వారు ఎలాంటి వారితో తిరుగుతున్నారు, ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారనే విషయాలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలి.

**సమయం కేటాయించండి..**

పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ, వారికి మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాలను వివరించాలి. మత్తుకు బానిసై బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దు. క్షణకాలం ఇచ్చే కిక్ కోసం జీవితాంతం బాధపడేలా చేసుకోవద్దని యువతకు సూచన చేశారు.యువత జీవితాలతో ఆడుకునే గంజాయి వ్యాపారులపై, రవాణా చేసే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామనిఅయన హెచ్చరించారు.

**అందరం ఒక సైన్యంలా మారాలి.**

గంజాయి అనే మహమ్మారిని సమాజం నుండి తరిమికొట్టడానికి పోలీసులు,ప్రజలు, తల్లిదండ్రులు ఒక సైన్యంగా ముందుకు సాగాలి.అప్పుడే మన పిల్లలకు,రేపటి తరానికి ఒక ఆరోగ్యకరమైన,ఉజ్వలమైన భవిష్యత్తును అందించగలం.

**గంజాయి, డ్రగ్స్ రవాణాపై ప్రజలు నిఘా పెట్టండి.**

**మెట్ పల్లి సీఐ సురేష్ బాబు....**

**పోలీసులకు సమాచారమివ్వండి**

గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యత అని మెట్‌పల్లి సీఐ.సురేష్ బాబు గుర్తుచేశారు.మీ గ్రామాల్లో లేదా మీ పరిసరాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా,రవాణా చేస్తున్నా లేదా వినియోగిస్తున్నా వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. యువత జీవితాలతో ఆడుకునే గంజాయి, డ్రగ్స్ వ్యాపారులపై, రవాణా చేసే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని సీఐ సురేష్ బాబు హెచ్చరించారు.

## కుల మతాలకు అతీతంగా.. భక్తి శ్రద్ధలతో మొహరం వేడుకలు



**చురకలు విలేఖరి వీణవంక జూన్ 26 :** వీణవంక మండలంలోని పలు గ్రామాలలో గురువారం రోజు రాత్రి మొహరం ఘనంగా జరిగాయి.ఈ వేడుకలు మండలం లోని నర్సింగాపూర్ గ్రామం లో వేడుకల (పీర్ల)ను అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రతి ఏటా కులమతాలకు అతీతంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మట్టి తో తయారు చేసిన కొత్తకుండలో బెల్లం పానకంతో తయారుచేసిన షర్భత్,మటికీలను,మలీన ముద్దలు తయారు చేసుకొని ఊరేగింపుగా సాయంత్రం డప్పుచప్పులతో భక్తులు గ్రామంలోని పీర్ల చావడి వద్ద ఉన్న పీర్ల వద్దకు చేరికొని అక్కడ ఏర్పాటు చేసిన అగ్ని గుండం చుట్టూ తిరిగి,పీర్ల వద్ద మటికీలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.మరి కొందరు తమ కోరికలు నెరవేరాలని పీర్లకు దట్టీలను కట్టారు.పీర్లను పూజిస్తే కోరికలు నీరువేరుతాయని భక్తుల నమ్మకం.ఈ కార్యక్రమంలో మస్జీద్ కమిటీ సభ్యులు, కులమతాలకు అతీతంగా గ్రామస్థులు పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసు నమోదు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్(రామగిరి) జూన్ 26 :** పెద్దపల్లి జిల్లా రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 24 న కల్వచర్ల గ్రామానికి చెందిన బొంత సాయమల్లు(40) అనే వ్యక్తి మధ్యాహ్నం 3 గంటలకు ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు తన భార్య చూసి చుట్టు పక్కల, బంధువుల దగ్గర తెలుసుకున్న ఎక్కడికి రాలేదని తెలపడంతో సాయమల్లు భార్య రజిత పిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది.అతని వివరాలు తెలిస్తే మంథని సీఐ 8712656528, రామగిరి ఎస్సై 8712656532 నంబర్ లకు సమాచారం తెలపాలని కోరారు.

## ఘనంగా మండలంలోని పలు గ్రామాల్లో మొహరం వేడుకలు





**చురుకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 26 :** ఎల్లారెడ్డిపేట మండలం లోని పలు గ్రామాల్లో మొహరం వేడుకలను హిందూ ముస్లింలు కలిసి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు నారాయణపూర్ బండలింగంపల్లి గొల్లపల్లి తిమ్మాపూర్ గుండారం బోప్పాపూర్ వెంకటాపూర్,పదిర గ్రామాల్లో సాంప్రదాయం ప్రకారం పీరీలను నిలబెట్టారు.శుక్రవారం చివరి రోజు కావడంతో గ్రామాల్లోని ఇంటింటికి తిరగగా భక్తులు కూడకలు, ప్యాలాలు బెల్లం అటుకులు దస్తీలు కట్టి మొక్కలు చెల్లించుకున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా మొహరం వేడుకలు నిలుస్తాయి.హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా అన్ని కులాల వారు ఐక్యతతో,సోదర భావంతో పీరీల పండుగను జరుపుకున్నారు.పీరీలను అలింగనం చేసుకోవడం,ధూపం, సాంబ్రానీలను అతుక్కోవడం, విభూది బోట్టు పెట్టుకోవడం,కొబ్బరి కుడుకలు వేసి తమ కోరికలు నెరవేరాలని మోల్లె సబ్‌లతో నాడాలు (ఫకీర్) వేసుకొని మొక్కుకున్నారు.ఈ సందర్భంగా పలు గ్రామాలలో సర్పంచులు పాలకవర్గం ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు వేడుకలలో పాల్గొన్నారు.



## అంజన్నను దర్శించుకున్న అదనపు కలెక్టర్



**చురకలు విలేకరి, మల్యాల, జూన్ 26 :** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంను సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనం అనంతరం అర్చకులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా బిజెపి ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నారపాక అశోక్



**చురకలు విలేకరి, బీర్పూర్, జూన్ 26 :** బీర్‌పూర్ మండలంలో మంగేళ గ్రామానికి చెందిన నారపాక అశోక్ను జిల్లా బిజెపి ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఈ సందర్భంగా నారపాక అశోక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జగిత్యాల జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి కిరణ్, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు యాదగిరి బాబు, జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా. భోగ శ్రావణిలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి, దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి,ఎస్సీ సమాజాన్ని భారతీయ జనతా పార్టీతో మరింత అనుబంధంగా తీర్చిదిద్దేందుకు అందరి మార్గదర్శకత్వంలో తన శాయశక్తులా కృషి చేస్తానని నారపాక అశోక్ స్పష్టం చేశారు.

## విద్యార్థులను అభినందించిన మంత్రి అడ్లూరి



**చురకలు విలేకరి, ధర్మపురి,జూన్ 26 :** అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల విద్యార్థులను రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభినందించారు. మే 29నుండి 31వరకు నేపాల్ దేశం కాట్మాండ్ లో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్స్ షిప్ పోటీలల్లో పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఇప్పులపల్లి గ్రామానికి చెందిన రూషగాని వినూత్న అండర్ 9-10 బాలికల స్పారింగ్ విభాగంలో ప్రథమ స్థానం నిలువగా అండర్ 14-15 బాలికల స్పారింగ్ విభాగంలో వి నిహారిక ప్రథమ స్థానంలో నిలవగా దాసరి ధనస్విని 9-10 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. ఓదెల గ్రామానికి చెందిన లాగిశెట్టి శరణ్య 16-17 బాలికల స్పారింగ్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి బ్రౌంజ్ మెడల్ సాధించగా అండర్ 17-18 బాలికల స్పారింగ్ విభాగంలో ఎంబడి చందన తృతీయ స్థానం స్థానం బ్రౌంజ్ సాధించారు. కరాటే మాస్టర్ కాలువల రమేష్ ఆధ్వర్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కలువగా వీరిని మంత్రి అభినందించారు.

# మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, జూన్ 26 :** మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, గుడిపేట 13వ పటాలం కమాండెంట్ లతో కలిసి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఐ.బి. చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి, యువత భవిష్యత్తుకు ప్రమాదకరమని, అందరం సమిష్టిగా కృషి చేసి మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దు దామని అన్నారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని,మాదక ద్రవ్యాలకు సంబంధించిన అనుమా నాస్పద కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.మాదక ద్రవ్యాల ఉత్పత్తి,రవాణా, విక్రయం, వినియోగాన్ని నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రగ్స్ రిహాబిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని,బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. చట్ట విరుద్ధంగా మద్యం, గంజాయి, సిగరెట్లను విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని తెలిపారు.డి.సి.పి. మాట్లాడుతూ మాదకద్రవ్యాల తరలింపు పై ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసి నిరోధించడం జరుగుతుందని,ఎక్కడైనా మత్తుపదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100లో సమాచారం అందించి తగ్గుముఖం పట్టేలా సమన్వయంతో పని చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణపై అందరిచే ప్రతిజ్ఞ చేయించారు.

# మహిళా చట్టాలపై సదస్సు



**చురకలు విలేకరి, జగిత్యాల,జూన్ 26 :** తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరిఅశోక్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో వయోధికుల పై వేధింపుల నివారణ పక్షోత్సవాల సందర్బంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 16మంది వయోధిక మహిళలను సన్మానించారు. ఈ సందర్బంగా గృహ హింస, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కృష్ణా రెడ్డి,పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, సమానత్వ వేతన చట్టంలపై సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్‌కుమార్ అవగాహన కల్పించారు.ఈ సదస్సులో మాజీ మున్సిపల్ చైర్మన్ జీ ఆర్. దేశాయ్, సీనియర్ సిటిజెన్స్ జిల్లా కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాథం,సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్,ఉపాధ్యక్షులు వి.ప్రకాష్ ,ఎం.డి.యాకూబ్,ఆర్గనైజింగ్ కార్యదర్శి కే. సత్యనారా యణ,మహిళా కార్యదర్శి బొబ్బాటి కరుణ,కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం,జగిత్యాల పట్టణ అధ్యక్షులు మానాల కిషన్,జగిత్యాల డివిజన్ అధ్యక్షులు బి. రాజేశ్వర్, ధర్మపురి అధ్యక్షులు కండ్లె గంగాధర్, కార్యదర్శి దుబ్బేశం,బాలయ్య,ప్రసాద్, నారాయణ, వివిధ సంఘాలప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి

**-కాంగ్రెస్ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి**

**-ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండాలి**

**-ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి) జూన్ 26 :** రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియ ప్రారంభం అయిన నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి పట్టణ మరియు మండలంలోని బూత్ లెవల్ ఏజెంట్లు మరియు కాంగ్రెస్ నాయకుల తో కలిసి ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ..ఎస్ ఐ ఆర్ పట్ల ప్రతి కార్యకర్త అప్రమత్తంగా వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులు అందరూ అర్హులైన ప్రతి ఓటరు, ఓటరు జాబితాలో ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు (బి ఎల్ ఓ) ఇంటి ఇంటికి వచ్చినప్పుడు తప్పకుండా ప్రజలు సహకరించాలని కోరారు.ప్రతి ఒట్టురి మీ పేరు, చిరునామా,కుటుంబ వివరాలు, ఇతర సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సమాచారాన్ని అందించాలని సూచనలు చేశారు.ప్రజల విశ్వాసాన్ని,తీర్పును గెలుచుకోలేని వారు ఓటర్ల జాబితాల్లో గందరగోళం సృష్టించి,ఓట్లను తొలగించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించిన సందర్భాలను ఇటీవల పలు రాష్ట్రాల్లో చూశాము. అలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక రాజకీయాలకు తెలంగాణలో తావు లేదని ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ) అప్రమత్తంగా ఉండాలి.ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయి లో ప్రజలకు సహాయసహకారాలు అందించాలని సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్,కౌన్సిలర్లు, పలు గ్రామ సర్పంచులు,ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,బూత్ లెవెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా

# ఆరెపల్లి రాహుల్ నియామకం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (సుల్తానాబాద్)జూన్ 26 :** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆరెపల్లి రాహుల్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మంత్రి శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు విజయరమణారావు, రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్, సమన్వయకర్త కొరివి అరుణ్ కుమార్ లకు ఆరెపల్లి రాహుల్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం, ఎస్సీ వర్గాల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆరెపల్లి రాహుల్ పేర్కొన్నారు.

## ఘనంగా పాల ఉత్పత్తిదారుల సంస్థలో

# 24వ వార్షిక మహాసభ



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ జూన్ 26 :** మన్నెంపల్లి పాల ఉత్పత్తి దారులు సంస్థ ఆవరణలో ఈరోజు 24వార్షిక మహాసభ అధ్యక్షులు శ్రీ పోతుగంటి సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది దీనికి ముఖ్యఅతిథిగా డైరీ రూట్ సూపర్వైజ్ సింగిరెడ్డి మల్లారెడ్డి హాజరయ్యారు దీనిలో భాగంగా సెక్రటరీ గుశీటి మధుకర్ ఆదాయ లాభ నష్టాలు వివరించారు సంస్థ వార్షిక 89,00,792 లక్షల టర్నోవర్ చేయగా 5,34,464 నిఖర లాభం వచ్చింది.సంవత్సరకాలంలో సంఘంలో అత్యధిక పాలు సరఫరా చేసిన ఉత్పత్తి దారులకు ఆవుపాలలో మొదటి బహుమతి బూడిద సంపత్ ద్వితీయ బహుమతి కొలకని రాజయ్య గేదపాలలో మొదటి బహుమతి సిర్ర లచ్చయ్య ద్వితీయ బహుమతి తాళ్ల పెల్లి సూరమ్మ ఇవ్వడం జరిగింది.అధ్యక్షులుగా రెండవ సారి పోతుగంటి సంపత్ గారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అలాగే రెండు పాలక వర్గ స్థానాలు పదవీకాలం ముగియడంతో పురుషుల నుండి కోలి పాక రామస్వామి స్త్రీనుండి పారునంది రేఖ ఎన్నికైనారు.ఈ కార్యక్రమంలో పాలక వర్గా సభ్యులు ఖమ్మం ఓదలు పారునంది మల్లేష్ సానగొండ అనిల్ అనగోని రాజయ్య రావుల మల్లేశం కొలకని రాజయ్య జేజేల కనకమ్మ సిర్ర లచ్చయ్య దుర్గం హైమవతి సిబ్బంది బీనపల్లి చరణ్ బొగ్గుల చంద్రిక కొలిపాక సాయి చరణ్ సంఘసభ్యులు హాజరై విజయవంతం చేశారు.